

తిరుమలలో సూర్యప్రభ వాహనంపై మలయప్ప స్వామి


మంగళవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై మలయప్పను దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తజనం


సూర్యప్రభపై తిరుపతిలోని గోవిందరాజస్వామి

అంగరంగ వైభవం
అర్ధ బ్రహ్మోత్సవం

- వివరాలు 8వ పేజీలో -

సప్తవాహనసేవల ఊరేగింపులతో సప్తగిరులు పులకించిపోయాయి. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, గోవిందనామస్మరణలు, కర్పూరహారతులు, భజన, నృత్య, వాద్య బృందాల ప్రదర్శనలతో నాలుగు మాడవీధులు మారుమోగాయి. మంగళవారం తిరుమలలో రథసప్తమి సంబరాలు అంబరాన్నంటాయి. చీకటి తెరలు వీడకముందే తెల్లవారుజామునే ఏడుకొండల స్వామి సూర్యప్రభపై బయలుదేరాడు. ఒక్కో వాహనం మీద, ఒక్కో అలంకారంలో రాత్రి దాకా భక్తులకు కనువిందు చేశాడు. చలినీ, ఎండనూ లెక్కచేయకుండా లక్షలాది మంది భక్తులు మాడవీధుల్లో శ్రీనివాసుడి దర్శనం కోసం పరితపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డిప్యూటీ మేయర్ సైకిల్ వశం

కూటమి తరపున టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ విజయం

● వైసీపీకి 21, టీడీపీకి 27 మంది మద్దతు ● ఒకరు తటస్థం, ఇద్దరు గైర్హాజరు

తిరుపతి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నికపై ఉత్కంఠ వీడింది. 35వ డివిజన్ టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ప్రకటించారు. టీడీపీ అభ్యర్థి మునికృష్ణకు 26 మంది, వైసీపీ అభ్యర్థి లడ్డు భాస్కర్‌రెడ్డికి 21 మంది మద్దతు తెలిపారు. సోమవారమే డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగాల్సి ఉండగా, తగిన కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారం తిరిగి నిర్వహించారు.

సోమవారం నాటి హైడ్రామా సంఘటనలతో ఎన్నికల్లో టెన్షన్ తప్పదని అందరూ భావించారు. అయితే ప్రశాంతంగా డిప్యూటీ మేయర్ ఎన్నిక జరిగిపోయింది. మొదట ఎంపీ గురుమూర్తితో కలిసి 22 మంది వైసీపీ సభ్యులు బస్సులో సెనేట్ హాలుకు చేరుకున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 26 మంది కార్పొరేటర్లతో హాజరయ్యారు. ప్రత్యేక కౌన్సిల్ రిజిస్టర్‌లో సంతకాలు చేసి వారికి కేటాయించిన సీట్లలో కూర్చున్న తర్వాత ఎన్నికల అధికారి శుభం భన్సల్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. వైసీపీ అభ్యర్థి లడ్డూ భాస్కర్‌రెడ్డిని మేయర్ డాక్టర్ శిరీష, ఆదం రాధాకృష్ణారెడ్డి బలపరచగా, టీడీపీ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, అన్నా అనిత పైకి లేచి బలపరిచారు. అభ్యర్థులకు చేతులెత్తి మద్దతు తెలపాలని ఎన్నికల అధికారి సూచించారు. ముందుగా వైసీపీ అభ్యర్థి పేరు చెప్పగా 21 మంది సభ్యులు చేతులెత్తారు. అతర్వాత టీడీపీ అభ్యర్థికి 26 మంది సభ్యులు చేతులెత్తి మద్దతు పలకడంతో ఆర్సీ మునికృష్ణ విజయం ఖరారైంది.

ఎన్నిక జరిగింది ఇలా...

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 47 మంది కార్పొరేటర్లు, ముగ్గురు ఎక్స్‌అఫిషియో సభ్యులున్నారు. మొత్తం 50 మంది ఓటర్లుగా ఉండగా 48మంది ఎన్నికకు హాజరయ్యారు. ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఉన్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, 15వ డివిజన్ కార్పొరేటర్ షాలిని రెడ్డి గైర్హాజరయ్యారు.హాజరైనవారిలో 5వడివిజన్ కార్పొరేటర్ అమరనాథ్ రెడ్డి తటస్థంగా ఉండి ఎవరికీ మద్దతుతెలపలేదు.

వైసీపీ బృందంతో వచ్చి టీడీపీకి మద్దతు

వైసీపీ బృందం నుంచి వచ్చిన 22 మంది కార్పొరేటర్లలో 17వ డివిజన్ కార్పొరేటర్ రత్నకుమారి టీడీపీకి మద్దతు పలికారు. దీంతో వైసీపీ 21 ఓట్లకే పరిమితమైంది. అదేవిధంగా 5వ డివిజన్ కార్పొరేటర్ అమరనాథ్ రెడ్డి 26 మంది కూటమి బృందంతో కలిసి వచ్చినప్పటికీ ఎవరికీ మద్దతు తెలపకుండా మౌనంగా ఉండిపోయారు. దీంతో వైసీపీ బృందం నుంచి ఒక ఓటు కూటమికి వచ్చినప్పటికీ 26 మంది మద్దతు మాత్రమే మిగిలింది. ఇదిలావుంటే రత్నకుమారి టీడీపీకి మద్దతు పలకడంపై కౌన్సిల్ హాలులోనే కొందరు వైసీపీ మహిళా కార్పొరేటర్లు తూలనాడారు. సమావేశం అనంతరం ఆమె విలపిస్తూ సొమ్మసిల్లి బయట సోఫాలో వాలిపోవడంతో కూటమి మహిళా కార్పొరేటర్లు ఆమెకు సపర్యలు చేసి ఓదార్చారు.

విప్ టైమప్.. ఖంగుతిన్న వైసీపీ

డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రకియ ప్రారంభమవుతుండగా వైసీపీ తరఫున విప్ జాబితా దరఖాస్తును ఎంపీ గురుమూర్తి, కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డి ఎన్నికల అధికారికి అందజేయబోయారు. అయితే ప్రత్యేక సమావేశం 11 గంటలకు ప్రారంభమైందనీ, అంతకంటే ముందుగా ఇస్తేనే జాబితా తీసుకోవాలన్న నిబంధన ఉందని జేసీ చెప్పడంతో వారు ఖంగుతిన్నారు. విప్ జారీచేస్తే ప్రత్యర్థికి ఓటు వేసిన కార్పొరేటర్లు సభ్యత్వం కోల్పోయే అవకాశం ఉంటుంది. ఆ భయంతో అయినా తమకే ఓటు వేస్తారన్న వైసీపీ వ్యూహం బెడిసికొట్టింది.


డిప్యూటీ మేయర్ ఎన్నికలో కూటమి అభ్యర్థికి మద్దతుగా చేతులెత్తిన ఎమ్మెల్యే కార్పొరేటర్లు

ఒక్కడుగా మొదలై డిప్యూటీగా ఎదిగి..

వైసీపీ హయాంలో నాలుగేళ్ల క్రితం జరిగిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచిన ఏకైక కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ. అధికార బలంతో 26 డివిజన్లను ఏకగ్రీవం చేసుకుని 23 డివిజన్లను దౌర్జన్యంగా తన ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకున్న వైసీపీకి ఆర్సీ మునికృష్ణ ఒకే ఒక్కడిగా ఎదురునిలిచి టీడీపీ జెండా ఎగురవేశారు. కౌన్సిల్ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్లు దాడికి దిగేటంత పనికి ఒడిగట్టినా, అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఏక్ నిరంజన్ అంటూ హేళన చేసినా టీడీపీ తరఫున తన గళాన్ని వినిపిస్తూనే వచ్చారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతికార్యక్రమంలోనూ తనదైన శైలిలో అప్పటి అధికార పక్షంపై విరుచుకుపడే ఆర్సీ మునికృష్ణ పోరాట ధీరత్వానికి ఫలితం ఇప్పుడు దక్కింది. ఆ ఒక్కడూ వటుడింతై.. అన్నట్టుగా ఏకంగా డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు.

రాజకీయ నేపథ్యమిదీ :1998లో టీడీపీలో చేరిన ఆర్సీ మునికృష్ణ 2004లో జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009 నుంచి 2012 వరకు తిరుపతి నగర అధ్యక్షుడిగా పార్టీకి జవసత్వాలు నింపారు. ఆతర్వాత జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక గంగమ్మకు పరమభక్తుడైన ఆర్సీ 2017 నుంచి 2019 వరకు తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో 35వ డివిజన్ నుంచి టీడీపీ కార్పొరేటర్‌గా గెలిచి తాజాగా డిప్యూటీ మేయర్ కుర్చీని సాధించారు. కాగా తన గెలుపునకు సహకరించిన కూటమి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి అభివృద్ధి కోసం కూటమి నాయకులతో కలసి పనిచేస్తామని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.





ప్రతి జిల్లాలో క్యాన్సర్ డేకేర్ సెంటర్

● మూడేళ్లలో ఏర్పాటుకు కేంద్రం ప్రణాళిక ● వ్యాధి గుర్తించేందుకు పరీక్షలు నిర్వహిస్తున్నాం
● రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాబోయే మూడేళ్లలో ప్రతి జిల్లాలో క్యాన్సర్ డేకేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం ప్రణాళిక వేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. తిరుపతిలో మంగళవారం ఆయన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, కోలా ఆనంద్ తదితర నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో క్యాన్సర్ ద్వారా 9.93 శాతం మరణాలు సంభవిస్తున్నట్లు చెప్పారు. దీనిపై అవగాహన లేకపోవడం, ముందస్తు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. క్యాన్సర్ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. 1500 బృందాలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికి 71 లక్షలమందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించగా 66 వేలమంది అనుమానితులుగా తేలారన్నారు. వీరిని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్స్‌గా పరిగణిస్తున్న బోధనాస్పత్రులకు రెఫర్‌చేసి, మరోసారి పరీక్షలు నిర్వహించి క్యాన్సర్‌ను నిర్ధారిస్తామన్నారు. ఏ దశలో క్యాన్సర్ ఉందో గుర్తించి చికిత్స అందిస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన మహిళలు రొమ్ము, సర్వైకల్ కాన్సర్ నిర్ధారణ పరీక్షలను చేయించుకోవాలని సూచించారు.

గత లోపాలను సరిదిద్దుతున్నాం

కూటమి అధికారంలోకి రావడంతో ఐదేళ్ల పీడకల నుంచి రాష్ట్రం బయట పడిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. 'గత ఐదేళ్లలో రాష్ట్రం 20 సంవత్సరాల వెనుక బడింది. ఆయా లోపాలను సరిదిద్దుకుంటూ ఈ ఐదేళ్లలో 15 సంవత్సరాలు రాష్ట్రం ముందుకెళ్లేలా అభివృద్ధి పనులు చేపట్టాం' అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన వివరించారు. దార్శనికుడైన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. దీనికి కేంద్రం సహకరిస్తోందని, బడ్జెట్‌లోనూ ప్రత్యేక కేటాయింపులు చేయడంతోపాటు ప్రాయోజిత పథకాలద్వారా రాష్ట్రానికి లబ్ధి చేకూరుస్తోందని చెప్పారు.




పుష్కరిణి వద్ద షెడ్డుకున్న పరదాలు - వాహన సేవలో బెదిరిన గజరాజు

గజరాజు ఘీంకారం

● తిరుచానూరులోని వాహన సేవలో బెదిరిన ఏనుగు

తిరుచానూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా తిరుచానూరులో మంగళవారం ఉదయం సూర్యనారాయణ స్వామికి జరిగిన అశ్వవాహన సేవలో బెదిరిన గజరాజు ఘీంకరించింది. దీంతో భక్తులు ఆందోళన చెందారు. అమ్మవారి పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించాక దుస్తులు మార్చుకునేందుకు ఆలయం వెనుక తాత్కాలిక షెడ్లు వేశారు. వీటి చుట్టూ బ్లూరంగులో పరదా కట్టారు. అదే సమయంలో సూర్యనారాయణస్వామికి అశ్వవాహనసేవ సందర్భంగా గంగుండ్రమండపం వద్దకు వచ్చిన గజరాజు(శ్రీనిధి) ఆ షెడ్లకు చుట్టిన పరదా రంగును చూసి బెదిరింది. ఘీంకారం చేసింది. దీంతో భక్తులు, ఆలయాధికారులు ఆందోళన చెందారు. మావటిలు గజరాజును పక్కకు తీసుకెళ్లి సముదాయించారు. ఆ తర్వాత వాహన సేవల్లో యథావిధిగా గజరాజు పాల్గొంది.

మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బలోపేతం చేసే దిశగా మోడల్ పాఠశాలలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి అమలయ్యేలా చూడాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన డీఈవో కేవీఎన్ కుమార్‌తో కలిసి ఎంఈవోలకు పలు సూచనలు చేశారు. జిల్లాలో 130 క్లస్టర్లు ఉండగా.. ఒక్కోదానిలో 5నుంచి 10 వరకు పాఠశాలలు ఉంటాయన్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యను బట్టి మోడల్ పాఠశాలలుగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ మోడల్ స్కూల్‌లో ఐదుగురు ఉపాధ్యాయులు, 60మందికిపైగా విద్యార్థులు ఉంటారని వివరించారు. 60మంది విద్యార్థులకంటే తక్కువగా ఉన్న పాఠశాలలను బేసిక్ ఫౌండేషన్ పాఠశాలలుగా ఉంటాయన్నారు. గ్రామాల్లో బ్రిడ్జిలు దాటడం, 5 కిలోమీటర్లు ప్రయాణం చేసే విద్యార్థులకు రవాణా ఛార్జీలు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మినీ లారీ బోల్తా: డ్రైవర్ మృతి

తిరుచానూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):దామినేడు వద్ద రహదారిలో మినీ లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ అరుణ కథనం ప్రకారం వెంకటగిరి మండలం ఊట్లవారిపల్లెకు చెందిన మహేష్(27), మరో వ్యక్తి ప్రతీష్ కర్ణాటక నుంచి టమోటా లోడు వ్యానుతో వెంకటగిరికి బయలుదేరారు. మంగళవారం వేకువ జామున దామినేడు వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్ మహేష్ వెంటనే మృతి చెందాడు. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మహేష్ మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. గాయపడిన ప్రతీష్‌ను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరుణ తెలిపారు.

రైలు కింద పడి ఆత్మహత్య

చంద్రగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్రంకొండ మండలం అరిగివారిపల్లెకు చెందిన రవికుమార్‌యాదవ్(58) మంగళవారం సాయంత్రం వెంటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండగా రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృత దేహం నుజ్జు నుజ్జు అవ్వడంతో రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు బంధువులు రవి కనబడటంలేదని గాలిస్తున్నాడు. అతడి సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శ్రీనివాసమంగాపురం చేరుకోగా రవి ఆత్మహత్య చేసుకున్నాడని గుర్తించారు.

రెండవరోజూ వెటర్నరీ విద్యార్థుల సమ్మె



తిరుపతి రూరల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకారవేతనం అందించాలని ఎస్వీవెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. వర్సిటీ ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించి దీక్ష కొనసాగించారు. శిబిరాన్ని వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, డీఈ డాక్టర్ శోభామణి, సీవోఈ డాక్టర్ చెంగల్వరాయులు, ఏడీ డాక్టర్ జగపతిరామయ్య, ఓఎస్‌ఏ డాక్టర్ వేణు సందర్శించారు. దీక్ష విరమించాలని కోరారు. జీవో విడుదల చేసేవరకు దీక్ష విరమించేదిలేదని విద్యార్థులు తేల్చిచెప్పడంతో అధికారులు వెనుదిరిగారు.

శాస్త్రోక్తంగా మార్తాండ భైరవ హోమం



రావచంద్రాపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శక్తిపీఠంలో రాజశ్యామల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మార్తాండ భైరవ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత తిరుమంజనం నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రథసప్తమి సందర్భంగా సూర్యభగవానునికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. కార్యక్రమంలో కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి స్వామి పాల్గొన్నారు.

సప్త వాహనాలపై శ్రీవారి దేవేరి అభయం

● అశ్వ వాహనంపై సూర్యభగవానుడి సాక్షాత్కారం



సూర్యప్రభ వాహనం - హంసవాహనం - అశ్వ వాహనం- గరుడవాహన సేవ - చిన్న శేషవాహనంపై పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) వెంకటేశ్వరస్వామి దేవేరి, బ్రహ్మాండ నాయకి పద్మావతి దేవి కొలువై ఉన్న తిరుచానూరులో మంగళవారం వైభవంగా రథసప్తమి వేడుకలను నిర్వహించారు. అమ్మవారు ఉదయం నుంచి సాయంత్రం వరకు సప్తవాహనాలపై కొలువుదీరి తిరువమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.. ఉదయం 7గంటలకు సూర్యప్రభతో ప్రారంభమై మధ్యాహ్నం 2గంటల వరకు హంస, అశ్వ, గరుడ, చిన్న శేషవాహనాలపై అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం నేత్రపర్వంగా ఉత్సవవరులకు స్నపన తిరుమంజనం జరిగింది. 6గంటలకు చంద్రప్రభ, రాత్రి 8గంటలకు గజవాహనసేవ వేడుకగా జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని నారికేళ, కర్పూర హారతులు సమర్పించారు. గజరాజులు రాజసంగా కదులుతుండగా కళా, భజన బృందాలు, భక్తుల కోలాటాలు, ప్రబంధ వేద పారాయణం మధ్య వాహనసేవలు నేత్రానందంగా ముందుకు సాగాయి. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్,సుభాష్కర్‌నాయుడు,చలపతి,సుబ్బరాయుడు, ఏవీఐ బ్రహ్మానందరాజు,అర్చకులు,పాల్గొన్నారు.



చంద్రప్రభ వాహనం అమ్మవారు- అశ్వవాహనంపై సూర్యనారాయణస్వామి

అశ్వవాహనంపై ఊరేగిన ఆదిత్యుడు

రథసప్తమిని పురస్కరించుకుని తిరుచానూరులోని సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున మూల మూర్తికి అభిషేకం నిర్వహించారు. విశేషాలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం 6గంటలకు సూర్యనారాయణస్వామి అశ్వవాహనంపై మాడవీధుల్లో ఊరేగారు.

వెండి యజ్ఞోపవీతం వితరణ

సూర్యనారాయణస్వామికి తిరుపతి మంగళంకు చెందిన జయరాఘవులు 400 బరువుగల వెండి యజ్ఞోపవీతంను వితరణగా అధికారులకు అందజేశారు. మంగళవారం ఏఈవో దేవరాజులు, టెంపుల్‌ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, అసిస్టెంట్ అఖండం హరికి దాత యజ్ఞోపవీతాన్ని అందజేశారు.



అమ్మవారి వాహనసేవల ముందు కళా బృందాల ప్రదర్శన - గజవాహనంపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు - మాడవీధుల్లో భక్తజనం

డిప్యూటీ మేయర్ ఎన్నికకు భారీ భద్రత



బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా ఎస్వీయూ సెనేట్ హాలు వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా ఎన్నిక జరిగేలా చర్యలు చేపట్టారు. ఎన్నికలు జరిగే ప్రాంతంలోనే ఎస్పీ హర్షవర్ధనరాజు ఉండి బందోబస్తును పర్యవేక్షించారు. పోలీసు అధికారులకు, ఎన్నికల అధికారులకు సహకరించిన అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులకు ఎస్పీ ధన్యవాదాలు చెప్పారు.

కూటమి, వైసీపీ నేతల ఇళ్ల వద్ద భద్రత

డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. కూటమి, వైసీపీ నాయకుల ఇళ్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బీట్‌ల వారీగా సిబ్బందిని అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నియమిస్తున్నారు. ప్రధాన ప్రాంతాల్లో భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి గస్తీ ముమ్మరం చేశారు.

ప్రజలు ఛీ.. థూ.. అంటున్నారు: భూమన



కరుణాకర్‌రెడ్డి వద్దకు చేరిన నలుగురు కార్పొరేటర్లు

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియను చూసి ప్రజలు ఛీ.. థూ.. అంటున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ, కూటమి పాలన క్యాన్సర్ కంటే ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. తమ పార్టీ కార్పొరేటర్లు కొంతమందిని బెదిరించి, భయపెట్టి ఓట్లు వేయించుకుని గెలిచారన్నారు. నలుగురు కార్పొరేటర్లు మళ్లీ తమ వద్దకు వచ్చి క్షమాపణలు కోరుతూ, విధిలేని పరిస్థితుల్లో ఓట్లు వేశామని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను కూడా ఓటింగ్‌కు రానివ్వకుండా చేశారన్నారు. మేయర్‌ను కూడా దించడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఎంపీ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, అభినయ్‌రెడ్డి, కొందరు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

భూమన కాళ్లపై పడిన అనీష్ రాయల్

కూటమి డిప్యూటీ మేయర్ అభ్యర్థికి చేయి పైకెత్తి ఓటు వేసిన వైసీపీకి చెందిన నలుగురు కార్పొరేటర్లు అమరనాథరెడ్డి, బోకం అనిల్, అనీష్‌రాయల్, మోహన్ కృష్ణ యాదవ్ ఎన్నిక తర్వాత కరుణాకర్‌రెడ్డిని కలవడం విశేషం. అనీష్‌రాయల్ తనను క్షమించండంటూ కరుణాకర్‌రెడ్డి, అభినయరెడ్డి కాళ్లపై పడి బోరున విలపించారు. అధైర్యపడవద్దని పార్టీ అండగా ఉంటుందని వారికి భూమన భరోసా ఇచ్చినట్టు తెలిసింది. ఈ కార్పొరేటర్లు మాత్రం మీడియా సమావేశంలో మాట్లాడలేదు.

అంతా హైడ్రామా ఘటనలే

తిరుపతి, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక ఆద్యంతం హైడ్రామా ఘటనలే చోటుచేసుకున్నాయి. మంగళవారం ఉదయం ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను కిడ్నాప్ చేశారని వైసీపీ ఆరోపించింది. పోలీసులకూ ఫిర్యాదు చేశారు. తనను ఎవరూ కిడ్నాప్ చేయలేదని, అనారోగ్య కారణాలతో ఇంట్లోనే ఉన్నట్లు ఎమ్మెల్సీ ఓ వీడియో విడుదల చేశారు. దీంతో ఏం మాట్లాడాలో వైసీపీకి అర్థంకాలేదు. సోమవారం కూడా కార్పొరేటర్లు అమరనాథ్‌రెడ్డి, అనీష్ రాయల్, మోహన్ కృష్ణ యాదవ్‌లను కిడ్నాప్ చేశారని ఆరోపించిన కొద్ది సమయానికే వాళ్లు వీడియోలు విడుదల చేసిన విషయం తెలిసిందే.

అభినందనల వెల్లువ

డిప్యూటీ మేయర్‌గా గెలుపొందిన ఆర్సీ మునికృష్ణకు కూటమి నేతలు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్లు ఎన్వీ ప్రసాద్, నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, కూటమి నేతలు మబ్బు దేవనారాయణ రెడ్డి, జేబీ శ్రీనివాస్, శ్రీధర్ వర్మ, పులిగోరు మురళి, బీఎల్ సంజయ్, మహేష్ యాదవ్, సురేంద్ర నాయుడు, కంకణాల రజినీకాంత్ నాయుడు, బుల్లెట్ రమణ, పుష్పావతి యాదవ్, వెంకటేష్, కిరణ్ రాయల్, రాజారెడ్డి, హేమంత్ రాయల్, సుబ్బు యాదవ్, వివేక్, వినోద్ రాయల్ అభినందనలు తెలిపారు.



ఎన్నికల అధికారి నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్న ఆర్సీ మునికృష్ణ

ఇటు విజయం.. అటు నిరాశ



మంత్రి అనగానితో ఎమ్మెల్యే, కూటమి నేతలు, కార్పొరేటర్లు

కూటమిలో వర్గాలుగా విడిపోయిన నాయకులు ఏకమైతే ఫలితాలు ఎలా ఉంటాయో డిప్యూటీ మేయర్ ఎన్నిక నిరూపించింది. ఈ గెలుపుతో కూటమి నేతలు విజయోత్సవంలో మునిగిపోయారు. సెనేట్ హాలునుంచి డిక్లరేషన్ తీసుకుని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలసి బయటకు వచ్చిన ఆర్సీని కూటమి నాయకులు అభినందనలతో ముంచెత్తారు. ఇద్దరినీ భుజాలపైకి ఎత్తుకుని కూటమి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఓ హోటల్లో ఉన్న జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్లు ఎన్వీ ప్రసాద్, నరసింహ యాదవ్, కూటమి నేతలు మబ్బు దేవనారాయణ రెడ్డి, అన్నా రామచంద్రయ్య, జేబీ శ్రీనివాస్, ఆరణి మదన్, పులిగోరు మురళి, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్ తదితరులు వ్యూహ రచన చేశారు. వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లను కూటమి వైపు మళ్లించేందుకు ముద్ర నారాయణ, ఎస్కే బాబు, నరసింహాచారి, నరేంద్రనాథ్ తోడ్పడ్డారు. చివర్లో రంగంలోకి దిగిన శాప్ ఛైర్మన్ రవినాయుడు కీలకంగా మారారు. ఇలా అందరూ ఏకమై ఎన్నికను విజయవంతంగా ముగించారు. మరోవైపు ఎన్నికల వ్యూహాలు పన్నడంలో తమకు మించినవారులేరన్న ధీమాతో ఉన్న వైసీపీ.. కూటమి నేతలు ఇచ్చిన షాక్‌కు నైరాశ్యంలోకి వెళ్లింది.

మీ అరాచకం భరించలేకే కార్పొరేటర్లు మావైపు

● భూమనపై కూటమి నేతల ఆగ్రహం

తిరుపతి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): తిరుపతిని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టి చూపిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ తెలిపారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక అనంతరం ఓ హోటల్లో వీరు మీడియాతో మాట్లాడారు. కార్పొరేటర్లపై ఎన్డీఏ నేతలు ఏ ఒక్కరూ దౌర్జన్యం చేయలేదని, భూమన నియంతృత్వ పోకడలు, బానిస మనస్తత్వంతోనే మీ పార్టీ నేతలు బయటకువస్తున్నారన్నారు. రాజకీయాల్లో ఇక భూమన పని అయిపోయిందన్నారు. ప్రజాస్వామ్యం అపహాస్యం పాలైంది వైసీపీ పాలనలోనేనని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యం, నైతిక విలువల గురించి మాట్లాడే అర్హత భూమన లేదన్నారు. అభినయ్ రెడ్డి అలిపిరి పోలీస్ స్టేషన్‌కు అనుచరులతో వెళ్లి హల్‌చల్ చేసినా తాము ఎలాంటి చర్యలు తీసుకోలేదంటే అర్థం చేసుకోవచ్చన్నారు.

రేపు సీఎం, డిప్యూటీ సీఎంను కలవనున్న కార్పొరేటర్లు

సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను గురువారం గెలుపొందిన డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణతో పాటు కూటమి పార్టీలో చేరనున్న కార్పొరేటర్లను ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని విజయవాడకు తీసుకెళ్లనున్నారు.

శాప్ ఛైర్మన్‌పై విరుచుకుపడ్డ నంద్యాల ఏఎస్పీ

● దమ్ముంటే ఏమి చేస్తారో చేసుకోండని సవాలు



టీడీపీ నేతలతో వాదనకు దిగిన అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా ఎస్వీయూ ప్రధాన గేటు ముందు శాప్ ఛైర్మన్ రవినాయుడు, టీడీపీ నేతలు జేబీ శ్రీనివాస్, ఊకా విజయకుమార్ తదితరులపై నంద్యాల అదనపు ఎస్పీ యుగంధర్‌బాబు విరుచుకుపడ్డారు. వర్సిటీ ఎదుట వీరు కారు ఆపడంతో ఆయన అభ్యంతరం తెలిపారు. వెళ్లకుంటే కేసులు పెడతానంటూ హెచ్చరించారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు అరాచకాలు చేస్తుంటే అప్పుడేమి చేశారంటూ టీడీపీ నాయకులు ప్రశ్నించారు. వైసీపీ కార్పొరేటర్ల వెంట వందలాది మంది లోపలకు వెళుతుంటే కనపడలేదా అని నిలదీశారు. దీనిపై ఏఎస్పీ గట్టి స్వరంతో హెచ్చరిస్తుండగా, ప్రధాన గేటు వద్ద విధుల్లో ఉన్న కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ వచ్చి సర్ది పంపారు. ఈ ఘటనపై శాప్ ఛైర్మన్ రవినాయుడు మీడియాతో మాట్లాడుతుండగా మళ్లీ అక్కడకు వచ్చిన ఏఎస్పీ యుగంధర్ బాబు 'రారా చూసుకుందాం.. ఏం చేస్తావు' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. ఎస్టీఎఫ్ సిబ్బంది, అలిపిరి సీఐ రాంకిషోర్ వచ్చి టీడీపీ నేతలకు సర్ది చెప్పి పంపేశారు. కాగా, శాప్ ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిన వైసీపీకి అధికారం పోయినా అహంకారం తగ్గలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్‌లోకి వెళ్లి అభినయ్ దౌర్జన్యాలు చేస్తుంటే పోలీసులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు.

ఒంటరిగా మిగిలిపోతారు

● పద్ధతి మార్చుకోవాలంటూ భూమనకు సామంచి హితవు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 'మీ పద్ధతి మార్చుకోండి. లేదంటే మీ పరివారం మొత్తం మాతో చేరిపోతారు. మీరు ఒంటరిగా మిగులుతారు' అంటూ భూమన కరుణాకరరెడ్డికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో కలిసి మంగళవారం ఆయన తిరుపతిలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో పాల్పడిన అరాచకాలను గుర్తుచేశారు.

ఆరుగురు ఎర్ర స్మగ్లర్ల అరెస్ట్

● తొమ్మిది ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా వీరబల్లె ఫారెస్ట్ బీట్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఆరుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ కె.సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన బృందం సోమవారం నుంచి వీరబల్లె అటవీప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. ఆ ప్రాంతంలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేస్తుండగా మంగళ వారం తెల్లవారుజామున వీరబల్లె మండలం ఝరికోన వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళ్తూ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కంటపడ్డారు. వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. సిబ్బంది వారిని వెంటబడి ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి తొమ్మిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారంతా తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. ఎస్ఐ ఎండీ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్‌కి తీవ్ర గాయాలు

చంద్రగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అగరాల వద్ద జాతీయ రహదారిలో మంగళవారం లగేజీ వ్యాను అదుపు తప్పి కల్వర్టును ఢీకొంది. పోలీసుల కథనం మేరకు పలమనేరుకు చెందిన డ్రైవర్ బాలాజీ బొలెరో లగేజీ వ్యానులో ఆయిల్ ప్యాకెట్లు లోడ్‌కు వేసుకుని చిత్తూరు నుంచి తిరుపతికి వస్తున్నాడు. అగరాల వద్దకు వాహనం అదుపు తప్పి, రోడ్డు పక్కన కల్వర్టును ఢీకొంది. వ్యాను ముందుభాగం నుజ్జు నుజ్జయింది. బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. రుయాకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.



బంగారు తిరుచ్చిపై శ్రీనివాస మంగాపురం కల్యాణ వెంకన్న - సూర్యప్రభ వాహనంపై చంద్రగిరి కోదండరాముడు - మూలస్థాన ఎల్లమ్మ- తుమ్మలగుంట కల్యాణ వెంకన్న

శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి బంగారు తిరుచ్చి వాహనంపై అధిష్టించారు. ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి దక్షణమాడవీధిలో వేంచేపు చేసి సూర్యకిరణాలు స్వామివారి ఉత్సవర్లపై పడిన తరువాత స్వామివారు ఆలయానికి చేరుకున్నారు. చంద్రగిరిలోని కోదండరామాలయంలో స్వామివారిని తిరుచ్చి వాహనంపై పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాల్లో శ్రీనివాసమంగాపురంలోని టీటీడీ అధికారులు,అర్చకులు పాల్గొన్నారు. అలాగే మూలస్థాన ఎల్లమ్మ ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరసామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రివరకు స్వామివారు సప్తవాహనాల్లో ఊరేగి భక్తులను కనువిందు చేశారు. సూర్యప్రభవాహన సేవ తర్వాత జరిగిన చక్రస్నానానికి భక్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదంపతులు మొక్కు చెల్లించారు.

-చంద్రగిరి,తిరుపతి రూరల్ (ఆంధ్రజ్యోతి)

వాహన సేవల ఏర్పాట్లపై భక్తుల సంతృప్తి

తిరుమల, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం రథసప్తమి వాహనసేవల ఏర్పాట్లను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు పరిశీలించారు. వారు అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, శాంతారామ్, సదాశివరావుతో కలిసి భక్తులతో మాట్లాడారు. ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. అన్నప్రసాదాలతోపాటు పాలు, మజ్జిగ, బాదంపాలు,శనగలు ఇచ్చారన్నారు. వేంకటేశ్వర బాలమందిర విద్యార్థులు ఆలపించిన 'ఆదిత్యహృదయం', 'సూర్యాష్టకం' శ్లోకాలు ఆకర్షణగా నిలిచాయి.



తిరుమలలో మంగళవారం సూర్యప్రభ వాహనం వద్ద టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ అధికారులు


తిరునగరిలో పుస్తక పరిమళం

● ఐదవ రోజుకు చేరిన 17వ పుస్తక ప్రదర్శన ● తరలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు
● ఆకట్టుకుంటున్న సంగీత, సాహిత్య ప్రదర్శనలు, ప్రసంగాలు



పుస్తక ప్రదర్శనలో నేడు

పుస్తక ప్రదర్శనలో బుధవారం సాయంత్రం 6 గంటలకు చేపట్టే గీతా వేదికలో ఇస్కాన్ అధ్యక్షుడు రేవతీరమణ దాస్, రిటైర్డు డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గాలి గుణశేఖర్ భగవద్గీత గురించి మాట్లాడతారు. ఈ కార్యక్రమానంతరం సంగీత కచేరి నిర్వహించనున్నారు.



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పుస్తక పరిమళం గుబాళిస్తోంది. ఇస్కాన్ ఆలయ సమీపంలోని వినాయక మైదానంలో చేపట్టిన 17వ పుస్తక ప్రదర్శన నేటికి ఐదో రోజుకు చేరింది. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ పుస్తక ప్రదర్శన కొనసాగింది. సాయంత్రం చేపట్టిన వివిధ సంగీత, సాహిత్య ప్రదర్శనలను సందర్శకులను ఆకట్టుకున్నాయి. కుటుంబ సమేతంగా తరలి వస్తున్న పుస్తక ప్రియులు ఆసక్తిగా పుస్తకాలను చూసి కొనుగోలు చేస్తున్నారు. భారతీయ విద్యా భవన్ (బీవీబీ) డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణరాజు అధ్యక్షతన సాయంత్రం నిర్వహించిన సభలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్ కె.మధుజ్యోతి, అవధానం భరత్‌కుమార్ శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.


పుస్తకాన్ని పరిశీలిస్తున్న విద్యార్థిని

● పుస్తక ప్రపంచం - అన్వీక్షికి పబ్లిషర్స్

ఐదేళ్ల క్రితం ఏర్పాటైన అన్వీక్షికి ప్రచురణ, విక్రయ సంస్థ పలు రికార్డులు సృష్టించింది. సినీ హాస్య నటుడు బ్రహ్మానంద జీవిత చరిత్ర పుస్తకాలను ఈ సంస్థ ప్రచురించింది.తక్కువ కాలంలోనే 25 వేల కాపీలు అమ్మి రికార్డు సృష్టించింది. 'ఇన్ ద మూడ్ ఫర్ లవ్' అనే ప్రేమ కథల సంకలనం కూడా 10 వేల పుస్తక ప్రతులు అమ్మిన చరిత్ర అన్వీక్షికి సొంతం. జి. కళ్యాణరావు 'అంటరాని వసంతం', బండి నారాయణ స్వామి 'శప్తభూమి', మధురాంతకం నరేంద్ర 'మనోధర్మ పరాగం' వంటి పుస్తకాలను ప్రచురించారు. సుమారు 200 కొత్త పుస్తకాలను ప్రచురించడం ద్వారా 50 మంది కొత్త రచయితలను లోకానికి పరిచయం చేసిన ఘనత అన్వీక్షిక ప్రత్యేకత. కొత్త తరం పాఠకుల కోసం ఎన్నో పుస్తకాలను అందిస్తున్న అన్వీక్షికి తిరుపతి పుస్తక ప్రదర్శనలో ప్రత్యేక స్టాల్ - 59 ఏర్పాటు చేసింది.

● మన పుస్తకం - నిశ్శబ్దపు చప్పుడు

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర ఈ పుస్తకం రాశారు. 2024 మే నెలలో చౌడేపల్లెలో గల విజయవాణి ప్రింటర్స్‌లో ఈ పుస్తకాన్ని ప్రచురించారు. 232 పేజీలు గల ఈ పుస్తకం ధర రూ.200గా నిర్ణయించారు. 1978-2024 మధ్య రాసిన కథల్లో నుంచి స్త్రీల జీవిత ఇతివృత్తంగా రాసిన 18 కథలను ఎంపిక చేసి నిశ్శబ్దపు చప్పుడు పుస్తకంగా తెచ్చారు. మహిళల జీవితంలో వచ్చిన మార్పులను ఈ కథలు చిత్రించాయి. తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవడానికి మహిళలు పడిన ఆరాటం, చేసిన పోరాటం ఈ కథల నిండా పరుచుకొని ఉంటుంది. ఈ పుస్తకం తిరుపతి పుస్తక ప్రదర్శనలో స్టాల్- 47, 48 స్టాల్స్‌లో లభిస్తాయి.

నేనేం చదువుతున్నానంటే?



'ఏదైనా ఒక కొత్త అంశంపై పరిశోధన చేస్తున్నప్పుడు ఇప్పటి వరకు ఆ అంశంపై వచ్చిన పుస్తకాలను చదవడం ఓ అలవాటు. 'ద సుప్రీం లార్డ్' అనే పేరుతో ఇటీవల తిరుమల చరిత్రపై ఒక పుస్తకం రాశాను ఇందుకోసం అనేక పుస్తకాలు, వ్యాసాలు, శాసనాలు పరిశీలించాను. ఇండియన్ ఆర్కిటెక్చర్, ఆర్ట్ పుస్తకాలను చదువుతుంటాను. వీలైనప్పుడు తెలుగులో వచ్చిన కథలు, కవిత్వం, నవలలు వంటి పుస్తకాలు చదువుతున్నాను. ప్రస్తుతం మధురాంతకం నరేంద్ర 'నిశ్శబ్దపు చప్పుడు' చదువుతున్నాను.'

- ప్రొఫెసర్ కిరణ్‌క్రాంత్ చౌదరి, ప్రముఖ చరిత్ర పరిశోధకులు

ఇంగ్లీష్ పుస్తకాలు కొన్నా



ఇంగ్లీషు లాంగ్వేజ్‌లో ఉన్న చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీషు పుస్తకాలంటే చాలా ఇష్టం. ఇందువల్ల మంచి ఇంగ్లీషు పుస్తకాలు చూసి కొన్నాను. ఇంగ్లీషులో బాగా మాట్లాడటం, రాయడానికి అవసరమైన పుస్తకాలను సెలెక్ట్ చేసుకొని కొనుగోలు చేశాను.

- కె. తన్విత, ప్రభాత్ స్కూల్

సైన్స్ బుక్స్ చాలా బాగున్నాయి



సైన్స్ బుక్స్ ఈ బుక్ ఫెయిర్‌లో చాలా ఉన్నాయి. సైన్స్‌లో బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ బుక్స్ అంటే నాకు చాలా ఇష్టం. ఈ సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు ఎంపిక చేసుకొని కొన్నాను.

- శ్రీనివాస కౌశల్, 7వ తరగతి, గీతం టాలెంట్ స్కూల్

మంత్రి సత్యప్రసాద్‌కు సత్కారం



తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్య కాండను నిలువరించి టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ విజయానికి కృషిచేసిన మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమ్మణ్యం మంగళవారం ఘనంగా సత్కరించారు. తిరుపతి కార్పొరేషన్‌లో టీడీపీ జెండా రెపరెపలాడించిన మంత్రి కృషిని టీడీపీ నాయకులు ఊకా విజయకుమార్, బుల్లెట్ రమణ, అన్నా రామచంద్రయ్య, రాష్ట్ర యువత అధికార ప్రతినిధి మధు, రఫి, శంకర్‌యాదవ్ సన్మానించారు.

డీజీపీని కలిసిన టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

మంగళం, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఏపీ డీజీపీగా బాధ్యతలు చేపట్టిన హరీష్‌కుమార్ గుప్తాని మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీకి టాస్క్‌ఫోర్స్ పనితీరును ఎస్పీ వివరించారు. ఆపరేషన్‌లో చేపడుతున్న కూంబింగ్ వివరాలు, సాంకేతికంగా తీసుకుంటున్న చర్యల గురించి తెలియజేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు మరింత కృషి చేయాలని డీజీపీ సూచించారు.

ఎస్వీ జూనియర్ కళాశాలలో రథసప్తమి



తిరుపతి(విద్య), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ జూనియర్ కళాశాలలో రథసప్తమి మహోత్సవ కార్యక్రమం మంగళవార ఘనంగా జరిగింది. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో రథసప్తమి ఉత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేద పండితులు సూర్యపూజ నిర్వహించారు. బాల మందిరం విద్యార్థులు ఆదిత్య హృదయం, శ్రీ సూర్యాష్టకం పారాయణం చేశారు. ముఖ్య వక్తగా హాజరైన ప్రవచకులు ఆదిత్యశర్మ రథసప్తమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కళా శాల ప్రిన్సిపాల్ సి.ప్రకాష్‌బాబు, తిరుమల వేద పాఠశాల పురోహితులు విజయస్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. యోగా అధ్యాపకురాలు ఎస్.విజయలక్ష్మి విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. డీపీపీ సమన్వయకర్త ఎస్.కోకిల, అధ్యాపకులు ప్రియవర్ధన బాబు, డాక్టర్ ప్రసన్నలక్ష్మి, డాక్టర్ చెన్నారెడ్డి, డిప్యూటీ వార్డెన్ కె.సోమశేఖర్, ఎన్‌సీసీ సీటీవో లోకేష్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.


డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్‌సీ మునికృష్ణను సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు కొల్లూరి ఇందుశేఖర్

క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే ప్రాణహాని ఉండదు


కార్యక్రమంలో మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి (వైద్యం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తించి సరైన వైద్యం చేయించుకుంటే ప్రాణహాని ఉండదని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్విమ్స్‌లోని పద్మావతి ఆస్పత్రిలో మంగళవారం క్యాన్సర్‌పై ప్రత్యేక అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇప్పుడు క్యాన్సర్‌కు అధునాతన వైద్య పద్ధతులు అందుబాటులో ఉండటం వలన చికిత్స అందించి బాధితుల ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉందన్నారు. డీన్ అల్లాడి మోహన్, ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు నరేంద్ర, సుబ్రహ్మణియన్, అద్వైత, నాగరాజు, మణిలాల్, నగేష్, ప్రాణబంధు దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పది మందిలో ఒకరికి క్యాన్సర్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రతి పది మందిలో ఏడుగురిని క్యాన్సర్ పట్టి పీడిస్తోందని బీజేపీ నేత నవీన్‌కుమార్ రెడ్డి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం కమ్యూనిటీ పారా మెడిక్స్, ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నూరు దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ధూమపానం, మద్యపానం, పొగాకు ఉత్పత్తుల వాడకంతోనే ఎక్కువగా క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ వీటికి దూరంగా ఉండాలని కోరారు.

వాకాడులో నేడు 10 ఆర్టీసీ నూతన బస్సులు ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వాకాడు డిపోకు చెందిన పది ఆర్టీసీ నూతన బస్సులను బుధవారం ప్రారంభించనున్నారు. కిలోమీటర్ల కాలపరిమితి ముగిసిన బస్సుల స్థానంలో ఈ బస్సులను నడపనున్నారు. ఈ మేరకు వాకాడులోని కోట బస్టాండు నుంచి విజయవాడకు 1, ప్రొద్దుటూరుకు 1, కడపకు 3, తిరుపతికి 3, నెల్లూరుకు 2 బస్సులు తిరగనున్నాయి.అతిథులుగా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డీపీటీవో జి.నరసింహులు హాజరుకానున్నారు.

30ఏళ్ల లోపు క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలి

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): 11 నుంచి 30 ఏళ్ల లోపు క్యాన్సర్ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని స్వీకార్ ఆస్పత్రి డాక్టర్ ప్రశాంత్ వెల్లడించారు. స్థానిక రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం రాస్ మహిళా పొదుపు సంఘాల సభ్యులకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. జంక్ ఫుడ్, పొగాకు, సిగరెట్లు, మద్యానికి దూరంగా ఉండాలని తెలియజేశారు. డాక్టర్ లక్ష్మీ సంధ్య, రాస్ డైరెక్టర్ వి.నాగరాజు పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్‌ను జయించవచ్చు

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుత జీవన విధానంలో ఎక్కువగా ప్రబలుతున్న ప్రాణాంతక వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటి. అవగాహనతోనే దీనిని జయించవచ్చు' అని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ, వైద్య కళాశాల ఆధ్వర్యంలో తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు మాట్లాడారు. క్యాన్సర్ నిర్మూలనకు ప్రతి ఆస్పత్రిలో ప్రత్యేక వైద్యం, పాలియేటివ్ కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెస్తోందన్నారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ప్రసూతి ఆస్పత్రి విభాగాధిపతి ప్రమీల, వైద్య విభాగాధిపతులు వెంకటేశ్వర్లు, నారాయణమూర్తి, రోజారమణి, రుయా మాజీ సూపరింటెండెంట్ భారతి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ రిజిస్ట్రార్‌గా వెంకట నారాయణరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా కడియం వెంకట నారాయణరావు నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రిజిస్ట్రార్‌గా నారాయణరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. వీసీ కృష్ణమూర్తి, డీన్ ప్రొఫెసర్ రమాకాంత్ శుక్లా, అధికారులు, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు అభినందించారు.

మార్చి 31లోపు బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోండి

తిరుపతి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): 2019లో ప్రభుత్వం జారీచేసిన బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్) నందు అనుమతి లేని, విరుద్ధంగా నిర్మించిన భవనాల క్రమబద్ధీకరణకు మార్చి 31లోపు దరఖాస్తు చేసుకో వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా 2020లో ప్రభుత్వం జారీచేసిన లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) నందు అనుమతిలేని లేఔట్లు, ప్లాట్లు కమబద్ధీకరించుకోవడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి : కలెక్టర్



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలపై అధి కారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించాలని తిరిగి రీఓపెన్‌కు తావులేకుండా చర్యలు చేపట్టాలని అధి కారులకు సూచించారు. ప్రతి సోమవారం అన్ని మండలాలు, డివిజన్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించాలని ఈ విషయాన్ని అర్జీదారులకు ముందుగానే సమా చారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో నరసింహులు, డిప్యూటీ కలెక్టర్ రోజ్మండ్ తదితరులు పాల్గొన్నారు.

శృతికి డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ పరిశోధక విద్యార్థి ఎస్. శృతి డాక్టరేట్ పొందారు. 'యాన్ ఎఫీషియంట్ అప్రోచ్ ఫర్ ఐడెంటిఫికేషన్ ఆఫ్ ఫైర్ యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్' అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ బి.అనూరాధ పర్యవేక్షకులుగా వ్యవహరించారు.



వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శన



ఏడు వాహనాలపై కొండల స్వామి

తిరుమల,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సంబరాలతో మంగళవారం తిరుమల కొండ కిటకిటలాడింది. సప్త వాహన సేవలను తిలకించిన భక్తజనం తన్మయులయ్యారు. వేకువజాము 5.30 గంటలకు వాహన మండపం నుంచి సూర్యప్రభ వాహనంలో విశేష అలంకరణతో మలయప్ప స్వామి బయలుదేరాడు. వాయువ్య మూలలో వేంచేసి సూర్యోదయం కోసం ఎదురు చూశాడు. సరిగ్గా 6.48 గంటలకు రవి కిరణాలు స్వామిని తాకాయి. ఆ క్షణం కోసమే గ్యాలరీల్లో ఎదురు చూసిన భక్తజనం గోవిందనామస్మరణలతో ఆ ప్రాంతం హోరెత్తింది. ఆ తర్వాత ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య చిన్నశేషవాహనం,11-12మధ్య గరుడవాహనం, మధ్యాహ్నం 1-2 మధ్య హనుమంతవాహనం నిర్వహించారు. మధ్యాహ్నం 2-3 మధ్య పుష్కరిణిలో చక్రస్నానం వైభవంగా జరిగింది. అంతకుముందు వరాహస్వామి ఆలయం వద్ద చక్రత్తాళ్వార్లకు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చందనంతో అర్చకులు అభిషేకం చేశారు. అధికారులతో పాటు భక్తులు పుష్కరిణిలో పవిత్రస్నానాలు ఆచరించారు. తిరిగి సాయంత్రం 4-5 మధ్య కల్పవృక్ష వాహనం, 6-7 మధ్య సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య చంద్రప్రభావాహనసేవలతో ఒక్క రోజు బ్రహ్మోత్సవాలు వేడుకగా ముగిశాయి.

మాడవీధులు కిటకిట

సోమవారం సాయంత్రం గ్యాలరీల్లోకి భక్తుల ప్రవేశం మొదలైంది. అర్ధరాత్రి ఉత్తరమాడవీధి పూర్తిస్థాయిలో నిండిపోగా, మంగళవారం వేకువజామునకు పడమర, దక్షిణ, తూర్పు మాడవీధులు, శ్రీవారి ఆలయం ముందు భాగం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఎండకు, చలికి ఇబ్బంది లేకుండా మాడవీధుల్లోని గ్యాలరీలపై షెడ్లు వేయడంతో ముందు రోజు సాయంత్రం నుంచీ మంగళవారం రాత్రి దాకా భక్తులు ఒక్కో వాహనాన్ని తిలకిస్తూ కూర్చుండిపోయారు. టీటీడీ అన్నప్రసాదాలు, తాగునీరు అందించడంతో ఇబ్బందిలేకుండా గడిపారు. రాంభగీచ అతిథిగృహాల వద్ద మాత్రం యాత్రికులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అక్కడక్కడ గేట్లకు తాళాలు వేయడంతో అగచాట్లు పడ్డారు.

కంగారు పెట్టిన గొడుగు



చిన్నశేష వాహనంలో గొడుగు జారడం అధికారుల్లో కంగారు పుట్టించింది. వాహనమండపం, పుష్కరిణి మధ్యలో వాహనబేరర్లు వాహనాన్ని పైకి, కిందకు ఊపుతూ వేగంగా నడవడంతో ఉత్సవమూర్తికి ఎడమవైపునున్న అర్చకుడి చేతి నుంచి గొడుగు కిందకు జారింది. అయితే వెంటనే అర్చకుడు అప్రమత్తమై గొడుగును పైకి ఎత్తి దాని స్థానంలో ఉంచడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు

రథసప్తమి సందర్భంగా టీటీడీ కల్పించిన సౌకర్యాలపై భక్తులందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదేవిధంగా రాబోవురోజుల్లో కూడా ఏర్పాట్లు చేయాలని కోరారు. గ్యాలరీల్లోకి స్వయంగా వెళ్లి ఆరా తీస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని భక్తులు చెప్పారు. ఇంతమంచి ఏర్పాట్లు చేయడంతో పాటు అధికారులు, పోలీసులు, విజిలెన్స్, శ్రీవారిసేవకులు సమర్థంగా విధులు నిర్వహించారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

\- బీఆర్ నాయుడు, టీటీడీ బోర్డు చైర్మన్

2.50 లక్షల మంది పాల్గొన్నారు

దాదాపు 2.50 లక్షల మంది భక్తులు పాల్గొని రథసప్తమి వాహన సేవలను వీక్షించారు. సోమవారం రాత్రికే దాదాపు 50 వేల మంది భక్తులు గ్యాలరీల్లోకి వచ్చారు. చాలా మంది ఏర్పాట్లపై మంచి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. పకడ్బందీగా ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి సమస్యలు రాలేదు. నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తున్నాం. మరుగుదొడ్ల ఏర్పాటుపై కూడా భక్తులు మంచి స్పందన ఇచ్చారు. రథసప్తమి విజయవంతం కావడం చాలా సంతోషంగా ఉంది.

\- శ్యామలరావు, టీటీడీ ఈవో

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో
నిందితుడికి ఏడాది జైలు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా మొదటి తరగతి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్. శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ఎర్రచందనం కోర్టు లైజన్ అధికారులు చంద్రశేఖరరాజు, రఘు తెలిపిన ప్రకారం.. డక్కిలి మండలం వెలికల్లుకు చెందిన మచ్చల గురునాథం 2012-13లో.. 18 ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తీసుకెళ్లడానికి కయ్యూరు చెరువులో దాచి ఉంచారు. ఈ విషయం తెలిసిన అటవీశాఖ అధికారులు ఆ దుంగలు స్వాధీనం చేసుకుని గురునాథంపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ శిరీష వాదనలు వినిపించారు. నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలు, రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

లా ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో 2024 అక్టోబరులో నిర్వహించిన ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్క్వాల్స్9, మనబడి వెబ్‌సైట్లలో ఈ ఫలితాల చూడాలని సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎంపీడీవోకు రూ.మూడేసి వేలు
ఎవరెవరు ఇస్తున్నారు?

- అవినీతి ఆరోపణలపై డ్వామా ఏపీడీ విచారణ



ఏపీడీ వరప్రసాద్

పెళ్లకూరు, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల బిల్లుల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి నగదు వసూలు చేస్తున్నారన్నారంటూ వచ్చిన ఆరోపణలపై డ్వామా ఏపీడీ వరప్రసాఏడ్ విచారణ చేపట్టారు. ఎంపీడీవోపై అవినీతి ఆరోపణలు చేసిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, సర్పంచు గుంటపూడి పెంచలయ్య సమక్షంలో మంగళవారం మండల కార్యాలయంలో ప్రమీలారాణిని విచారించారు. ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు చూపాలని మురళీకృష్ణారెడ్డిని ఏపీడీ కోరారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లను బహిరంగంగా విచారించారు. ఎంపీడీవోకు నెలకు రూ.3 వేలు చొప్పున ఎవరెవరు ఇస్తున్నారని ప్రశించగా, తాము ఇవ్వడంలేదని వారు చెప్పారు. విచారణాంశాలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తానని ఏపీడీ చెప్పారు.

మూడోసారీ.. హరిత పాఠశాల

- నారాయణవనం బాలికోన్నత పాఠశాలకు జాతీయస్థాయిలో గుర్తింపు



ఢిల్లీలో ఉత్తమ హరిత పాఠశాల అవార్డును అందుకుంటున్న శ్యామలత

నారాయణవనం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని బాలికోన్నత పాఠశాల 2024-25 సంవత్సరానికిగాను మూడోసారి కూడా హరిత పాఠశాలగా ఎంపికై జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినట్టు ప్రధానోపాధ్యాయురాలు శశికళ తెలిపారు. ఢిల్లీలో మంగళవారం జరిగిన నేషనల్ గ్రీన్ కోర్, సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ ఆధ్వర్యంలో ఉత్తమ హరిత పాఠశాల అవార్డును సీఎస్ఈ డైరెక్టర్ జనరల్ సునీత నరేన్ చేతుల మీదుగా పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ కె.వి.శ్యామలత అందుకున్నారు. పాఠశాలలో వ్యర్థాల నిర్వహణ, ఇంకుడు గుంత ద్వారా వర్షం నీటి నిల్వ, విద్యార్థుల పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటించడం, పచ్చదనం పెంచడం, విద్యుత్ ఆదా వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని హరిత పాఠశాల అవార్డు ఇచ్చారు. ఏపీ ఎస్‌జీసీ డైరెక్టర్ పి.స్రవంతి, డీఈవో కేవీఎస్ కుమార్, డీవైఈవో ప్రభాకర్ రాజు, ఏపీ రాష్ట్ర కోఆర్డినేటర్ నీలకంఠ తదితరులు ఉపాధ్యాయులను అభినందించారు.

బందోబస్తు సిబ్బందికి ధన్యవాదాలు

తిరుమల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందికి అనంతపురం రేంజ్ డీఐజీ షేమోషీ, ఎస్పీ హర్షవర్ధనరాజు శుక్రవారం రాత్రి ఓ ప్రకటన ద్వారా ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 1,400 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, కట్టుదిట్టమైన భద్రత నడుమ వాహనసేవలు జరిగాయని పేర్కొన్నారు. యాంటీ సబటేజ్ చెక్, ఫ్రిస్కింగ్, క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ నియంత్రణ వంటి చర్యలు చేపట్టామన్నారు. విజిలెన్స్‌తో సమన్వయం చేసుకుని చిన్నఘటన కూడా లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

పుత్తూరు వార్తలు

ఎస్వీపురం వద్ద రోడ్డుకు మరమ్మతులు



వడమాలపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా ఊట నీళ్లు నిలిచి గుంతలుగా ఉన్న రోడ్డుకు ఎమ్మెల్యే భానుప్రకాశ్ చొరవతో ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఆర్ అండ్ బీ అధికారులు మండలంలోని ఎస్వీపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఊట నీళ్లు నిలిచి గుంతలుగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేసారు. అలాగే జాతీయ రహదారితో పాటు పలు ప్రాంతాల్లో గుంతలను పూడ్చారు. ఆర్ అండ్ బీ డీఈ అమర్నాథ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు పనులను పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా సూర్య పూజోత్సవం

వడమాలపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమిని పురస్కరించుకుని పట్టణంలోని సంజీవరాయ ఆలయంలో మంగళవారం సూర్య యంత్ర ఆరాధన, విశేష ద్రవ్యాలతో అగ్ని హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివ స్వామి,సాయి స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాలతో సూర్య భగవానుడి ఆరాధన చేశారు. భక్తులతో సూర్య ద్వాదశ నామాలతో అర్ఘ్య ప్రధానం, గోత్ర నామాలతో సంకల్పం చేయించారు. సూర్యభగవానుడికి మంగళ హారతులిచ్చారు. తీర్థప్రసాద వినియోగం, అన్నదానాలు జరిగాయి. సాయంత్రం సూర్యుడి చిత్రపటాన్ని పూలమాలలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ఎరువులు అందుబాటులో ఉంచండి



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అగ్రికల్చరల్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే భానుప్రకాష్ సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో నగరి, పుత్తూరు డివిజన్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్లు సౌభాగ్య లక్ష్మి, రమేష్‌తో సమావేశమయ్యారు. వరి విరివిగా సాగు చేపడుతున్న నేపథ్యంలో ఎరువుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పుత్తూరు డివిజన్ పరిధిలో 531 హెకార్లలో వరి, చెరకు, మామిడి, వేరుశనగ, నువ్వులు, మినుములు సాగులో ఉన్నాయన్నారు. ఇప్పటికే మొదటి విడత ఎరువులు చల్లారని, రెండో విడత వేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే 60 మెట్రిక్ టన్నుల యూరియా ఆర్డర్ పెట్టినట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో యోగా, ప్రాణాయామం తరగతులు

పుత్తూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో విద్యార్థులకు మంగళవారం యోగా, ప్రాణాయామం తరగతులను తిరుపతి యోగా వెల్‌నెస్ నిర్వాహకులు శ్రీనివాసులు, హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు వేలాయుధాచారి, ధానిల్, హరీష్ పాల్గొన్నారు.

వైభవంగా రథ సప్తమి పూజలు



పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షి దేవి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో సూర్య భగవానుడికి రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులపై నిరసన



నిరసనలో ఎల్ఐసీ ఉద్యోగులు

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడును వందశాతం పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రకటించడంపై పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం భోజన విరామ సమయంలో తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ వంద శాతం విదేశీ పెట్టుబడుల కారణంగా ప్రైవేటు కంపెనీలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. దీంతో పాలసీ దారుల ప్రయోజనాలకు, బీమా సొమ్ముకు గ్యారంటీ లేకుండా పోతుందన్నారు.

30 ఏళ్లు దాటిన వారందరికీ క్యాన్సర్ పరీక్షలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించాలని జిల్లా కుష్ఠు, క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ నివావరణ దినం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందికి క్యాన్సర్లు, కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించారు. దేశంలో ఏడు రకాల క్యాన్సర్లతో ప్రజలు ఎక్కువ శాతం బాధపడుతున్నారని తెలిపారు. కాన్సర్‌లో ఊపిరితిత్తులు, రొమ్ము, నోరు, గర్భాశయం, కడుపు, అండవాహిక, కాలేయ క్యాన్సర్లు ఉంటాయని తెలిపారు. క్యాన్సర్‌ను ప్రథమ దశలో గుర్తించి సరైన చికిత్స, మందులు వాడితే పూర్తి స్థాయిలో నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుష్ఠు విభాగ పిజియోథెరిపి జిల్లా అధికారి వెంకటరమణ, డాక్టర్లు దివాకర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడుకు వెళ్లి పింఛను అందజేత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పేదలకు వరంలా మారింది. ప్రతినెలా వారికి 1వ తేదీనే పింఛను అందుతోంది. ఈ నేపథ్యంలో ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీ బాలకృష్ణాపురానికి చెందిన కోదండంగారి ప్రకాష్‌కు ప్రతి నెలా రూ.15వేలు పింఛను అందుతోంది. ప్రస్తుతం ఆయన చెన్నైకు సమీపంలోని కాట్పడిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీడీవో సౌభాగ్యం, సర్పంచ్ బాలగురునాథం యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు కందాడు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వెంకటేష్ సహకారంతో వెల్ఫేర్ అసిస్టెంట్ ఆనంద్ అక్కడికి చేరుకుని పింఛను అందజేశారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మండల సముదాయం ఎదురుగా ఉన్న సర్వే నెం.252, 253లోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులను ఆర్ఐ నల్లయ్య, వీఆర్వో బాలమురళి, పోలీసులుతో కలసి సోమవారం ఏర్పాటు చేశారు. సర్వే నెం.252లో డాక్టర్ బత్తెయ్య నాయుడు ఇటీవల కోర్టు ఆర్డర్ ఉందని భూమికి కంచె వేశారు. అదే విధంగా సర్వే నెం.253లో కనమనంబేడు దళితులు ఇంటి స్థలాలు కోసం భూమిని ఆక్రమించి చెట్టుపుట్టా తొలగించారు. స్పందించిన తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.53 లక్షలు



హుండీ ఆదాయ లెక్కింపును పర్యవేక్షిస్తున్న సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 105 రోజులకు గాను రూ.53,23,998 ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ సహాయ కమిషన్ బి.ప్రసన్నలక్ష్మి తెలిపారు. అలాగే విదేశీ కరెన్సీ యుఎస్ఏ డాలర్లు 31, సింగపూర్ డాలర్లు 4, సౌదీ రియాల్స్ 50, యూఏఈ దిరహమ్స్ 5, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, మలేషియా రింగట్స్ 12, ఆస్ట్రేలియా డాలర్లు 50, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమన్ 1 భక్తులు కానుకలుగా సమర్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస బాబు, ఆలయ సిబ్బంది కామేశ్వర రావు, మెప్మా సిబ్బంది, విశ్రాంతి బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోటలో నేడు ఆర్టీసీ బస్సుల ప్రారంభం

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని వాకాడు డిపోకు చెందిన పది ఆర్టీసీ నూతన బస్సులను బుధవారం ప్రారంభించనున్నారు. కిలోమీటర్ల కాలపరిమితి ముగిసిన బస్సుల స్థానంలో కొత్త బస్సులను నడపనున్నారు. ఈ మేరకు వాకాడు డిపో పరిధిలోని కోట బస్టాండు నుంచి విజయవాడకు 1, ప్రొద్దుటూరుకు 1, కడపకు 3, తిరుపతికి 3, నెల్లూరుకు 2 బస్సులు తిరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, డీపీటీవో జి.నరసింహులు హాజరుకానున్నారు.

మామిడి కాలువ సర్వే

నాయుడుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండంలోని మేనకూరు గ్రామంలో ఉన్న మామిడి కాలువను కొంతమంది ఆక్రమించి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారులకు పిర్యాదు చేశారు. మంగళవారం ఇరిగేషన్ డీఈ వీరాస్వామి, ఏఈ శ్రీనివాసులు, సర్వేయర్ చరణ్, ఆర్ఐ సాయితేజ మామిడికాలువ ప్రాంతాన్ని సర్వేచేసి కొలతలు తీశారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

అన్నదానం

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గమళ్లపాళెంలోని నిరాశ్రయుల కేంద్రంలో మంగళవారం శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మ యూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు.

నేడు ఓజిలి మండల మీట్

ఓజిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వ హించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

మినీలారీ బోల్తా : డ్రైవర్ మృతి

తిరుచానూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):దామినేడు వద్ద రహదారిలో మినీలారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఎస్ఐ అరుణ కథనయ వెంకటగిరి మండలం ఊట్లవారిపల్లెకు చెందిన మహేష్(27), మరో వ్యక్తి ప్రతీష్ కర్ణాటక నుంచి టమోటాలోడుతో వెంకటగిరికి బయలుదేరారు. మంగళవారం వేకువజామున దామినేడు వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్ మహేష్ వెంటనే మృతి చెందాడు. పోలీసులు చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మహేష్ మృతదేహాన్ని రుయా మార్చ్యూరీకి తరలించారు. గాయపడిన ప్రతీష్‌ను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరుణ తెలిపారు.

కార్మికుల హక్కులను కాలరాస్తే ఉద్యమం

కోట, ఫిబ్రవరి 4 (ఆంధ్ర జ్యోతి): కార్మికుల హక్కు లను యాజమాన్యాలు కాల స్తున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే ఉద్యమాలే శరణ్యమని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కోటలోని షాదీమంజిల్‌లో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నాన్ టీచింగ్ ఉద్యోగులకు అనుకూలంగా లేబర్ కోర్టు ఇచ్చిన తీర్పు ను కళాశాల యాజమాన్యం వెంటనే అమలు పరచాల న్నారు. సమావేశంలో ప్రభాకర్, కాలేషా, సీపీఐ నేతలు శశికుమార్, చంద్ర య్య, ఆదెయ్య, బాబు రావు, భూపతి, అంకమరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు బస్సుల ఢీ ఏడుగురికి గాయాలు

చిల్లకూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదనం టోల్ ప్లాజా సమీపంలో మంగళవారం రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... తిరుపతి నుంచి నెల్లూరు వైపు వెళ్తన్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సును అదే మార్గంలో వెళుతున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొంది. దీంతో ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్న తెలంగాణ రాష్ట్రం జనగాం జిల్లా హైతమడపల్లి గ్రామానికి చెందిన యగయ్య, కళమ్మ, శివకుమార్, వీరా స్వామి, జయకుమార్, హేమంత్‌కుమార్‌తో పాటు నెల్లూరు జిల్లా రాపూరు మండలం వేపినామి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఆనంద్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇరకం గ్రామస్తులను ఆదుకోండి



కలెక్టర్‌కు అర్జీ సమర్పిస్తున్న టీడీపీ నేత బొమ్మన శ్రీధర్

తడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇరకం గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారిని ఆదుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. మంగళవారం తిరుపతిలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఇరకం నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం కొత్త పడవ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఇరకం, భీములవారిపాళెంలో నాలుగుచోట్ల, పులికాట్ సరస్సు వద్ద పడవ ప్లాట్ ఫామ్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కలెక్టర్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జయపాల్, పరమన్, మణికలన్ పాల్గొన్నారు.





మంగళవారం ఉదయం 10.40గంటలకు కాదలూరు, 10.50కి కొండూరు, 11.30కి అండగుండాల సచివాలయాల్లో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సచివాలయాల్లో సిబ్బంది ఏరీ?

- కార్యాలయాల్లో కనిపించని సిబ్బంది
- ఫీల్డ్ వర్క్ పేరుతో డుమ్మా
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ శూన్యం

తడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలను ప్రజలకు సులభంగా అందాలనే ఉద్దేశంతో ఏర్పాటైన సచివాలయాలు నిద్రావస్థలో ఉన్నాయి. సచివాలయాల సిబ్బంది కార్యాలయాల ముఖం కూడా చూడడంలేదు. అడిగితే చేస్తే ఫీల్డ్‌వర్క్‌లో ఉన్నామని చెబుతున్నారు. గ్రామాల్లో విచారిస్తే సచివాలయ సిబ్బంది ఎవరూ రాలేదని స్థానికులు అంటున్నారు. ఇది తడ మండలంలోని సచివాలయాల పరిస్థితి. మండలంలో మొత్తం 18 పంచాయతీలకుగాను 16గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో సుమారు 170 మంది ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం 115మంది మాత్ర మే విధుల్లో ఉన్నారు. వారన్నా సక్రమంగా పనిచేస్తున్నారా అంటే అదీ లేదు. సచివాలయాల్లో ఎప్పుడు చూసినా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మంగళవారం మండలంలోని పలు సచివాయాలను ఆంధ్రజ్యోతి పరిశీలించగా కాదలూరులో నలుగురు, కొండూరులో ముగ్గురు, గ్రద్దగుంటలో నలుగురు, అండగుండాలలో నలుగురు, తడలో నలుగురు చొప్పున విధుల్లో ఉన్నారు. మిగిలిన సిబ్బంది ఏమయ్యారని విచారిస్తే ఈకేవైసీ, భూముల సర్వే, ఎంఎస్ఎంఈ వంటి ఏడు సర్వేలు చేసేందుకు ఆయా గ్రామాలకు వెళ్లారని సమాధానం చెప్పారు. ఆయా గ్రామాల్లో ఆరాతీస్తే సచివాయ సిబ్బంది ఎవరూ రాలేదని తెలిసింది. దీనిపై డీఎల్‌డీవో అధికారి జాలిరెడ్డి, ఎంపీడీవో విజయ కుమార్‌ను వివరణ కొరగా సచివాలయాలు ఉదయం 10.30నుంచి 5గంటల వరకు పని చేస్తాయని చెప్పడం గమనార్హం. అయితే ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే సచివాలయాల్లో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు

ఓజిలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్వప్న అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కల్లు, మద్యం వంటి మత్తు పదార్థాలను బహిరంగ ప్రదేశాల్లో సేవించరాదని సూచించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు.

దుకాణ సముదాయాలకు అద్దె చెల్లించండి

నాయుడుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించిన దుకాణ సముదాయాలకు అద్దె త్వరితగతిన చెల్లించాలని కమిషనర్ ఫజులుల్లా కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దుకాణాల అద్దె చెల్లింపులకు సంబంధించి రూ.90 లక్షల వరకు బకాయిలు ఉన్నాయని, త్వరితగతిన చెల్లించాలని నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. అదే విధంగా మున్సిపాలిటీ పరిధిలో 3,500కు పైబడి అనధికారిక కొళాయి కనెక్షన్లు కలిగి ఉండటంతో వాటిని క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కొంతమంది రెసిడెన్షియల్ కింద ప్లాన్ అప్రూవల్ తీసుకొని కమర్షియల్ నిర్మాణ పనులు చేపడుతున్నారని, వారందరికీ నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు



సూర్యప్రభ వాహనంలో ఊరేగుతున్న పాండురంగ స్వామి

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయం, మన్నారుపోలూరు అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సూర్యప్రభ వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అలాగే మన్నారుపోలూరు ఆలయంలో స్వామివారిని సూర్యప్రభ వాహనం ఊరేగించారు.

గూడూరు: పట్టణంలోని అళగనాధస్వామి ఆలయంలో స్వామి వారిని సూర్యప్రభ వాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం జరిపారు. అలాగే సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి ఉపపీఠంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో సూర్యభగవానుడికి హోమ పూజలు చేశారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోట: మండల పరిధిలోని గూడలిలో గల శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అదేవిధంగా శ్రీలక్ష్మమ్మకాలనీలోని సాయిబాబా ఆలయంలో, చిట్టేడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి గ్రామాల్లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో రథసప్తమి వేడుకలు జరిగాయి. విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రథసప్తమి వేడుకలు జరిగాయి. కళాశాలలో యోగాక్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, అసిస్టెంట్ పీడీలు శోభారాణి, రామ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రమౌళి నగర్‌లో ఉన్న సరస్వతీ మహావిద్యాలయ విద్యార్థులు మంగళవారం జాతీయ క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరస్పాండెంట్ విజయప్రియ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని విద్యార్థులు నినాదాలు చేస్తూ పాఠశాల నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. హోటళ్ల వద్దకెళ్లి ప్లాస్టిక్ కవర్లు వాడటం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రియ, మౌళిక, సుప్రజ, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

'థ్యాంక్యూ మోదీ' పోస్టుకార్డుల ఉద్యమం

గూడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అందరికీ సానుకూలమైన బడ్జెట్‌ను రూపొందించిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ 'థ్యాంక్యూ మోదీ' పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతి నిధి మనోజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ పోస్టుకార్డులను సేకరించారు. కార్యక్రమంలో శివశంకర్, ప్రణయ్, వాసు, కిరణ్, నవీన్, ప్రదీప్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు హాల్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం - సికింద్రాబాద్ - రామనాథపురం ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నాయుడుపేటలో అదనపు హాల్ట్ కల్పించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. సికింద్రాబాద్ - రామనాథపురం ఎక్స్‌ప్రెస్(07695) ఈనెల 5నుంచి రోజూ ఉదయం 8.18 గంటలకు నాయుడుపేటకు చేరుకొని 8.20 గంటలకు బయల్దేరుతుంది. అలాగే రామనాథపురం - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(07696) ఈనెల 7నుంచి రోజూ అర్ధరాత్రి 12.03 గంటలకు చేరుకొని 12.05 గంటలకు బయల్దేరి వెళ్లనుంది.

టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న రుద్రకోట సదాశివం

గూడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు తగిన గుర్తింపు లభించిందని నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట సదాశివం అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏపీలో 1989లో స్వర్గీయ నందమూరి తారక రామారావు నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌ను ప్రారంభించారన్నారు. పేదల అభ్యున్నతికి పాటు పడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి 1.33 లక్షల మందికి రుణాలు అందించడం జరిగిందన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు వేతనాన్ని రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందన్నారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం చేసిన 56 కార్పొరేషన్‌లకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్వవైభవం తీసుకువచ్చిందన్నారు. బీసీల అభ్యున్నతి కోసం పాటుపడేది టీడీపీనేనని అన్నారు. అనంతరం గమళ్లపాళెంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్‌కుమార్, వెంకటేశ్వర్లురాజు, పిళ్లెళ్ల శ్రీనివాసులు, గురునాథం, భాస్కర్, సుబ్రమణ్యం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 37 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా నిర్వహించారు. శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఉన్న పలు పరిశ్రమల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 72 మంది హాజరుకాగా 37 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌టీ వెంకటశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ కో ఆర్డినేటర్స్ హరికృష్ణ, సునీల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, జేకేసీ కో ఆర్డినేటర్స్ సుబ్రహ్మణ్యం శాస్త్రి, జీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ షరీనా

గూడూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగివుండాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. మంగళవారం స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరైన సమయంలో క్యాన్సర్ లక్షణాలను గుర్తించడం ద్వారా నయం చేసుకునే వీలుంటుందన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించడం ద్వారా క్యాన్సర్‌ను నివారించుకోవచ్చునన్నారు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయడం, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. యువత మత్తుపదార్థాలకు, చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవిప్రసాద్, భాస్కర్, స్వర్ణ, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన జపాన్ ప్రతినిధుల బృందం



జపాన్ ప్రతినిధుల బృందానికి స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జపాన్ - ఎహైమ్ రాష్ట్రానికి చెందిన 25మంది ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది. గవర్నర్ టోకిహిరో నకమురా నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రత్యేకతలు వివిధ రంగాలకు చెందిన అంతర్జాతీయ పరిశ్రమల ఉనికి గురించి వివరించారు. ఎహైమ్‌కు చెందిన వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల తయారీ పరిశ్రమ యూనిచార్మ్‌తో పాటు 30కు పైగా జపాన్‌కు చెందిన పరిశ్రమల ఏర్పాటుతో దేశంలోనే రెండవ అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ అవతరించిందని చెప్పారు. గవర్నర్ టోకిహిరో నకమురా అడిగిన ఒక ప్రశ్నకు సన్నారెడ్డి సమాధానమిస్తూ... ఆంధ్రప్రదేశ్ పెట్టుబడిదారుల అనుకూల విధానాలను వివరించారు. వేగవంతమైన అనుమతులు, ప్రోత్సాహకాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తదితర అంశాల గురించి వివరించారు. శ్రీసిటీలో పరిశ్రమల స్థాపనతో బలమైన ఉనికిని చాటాలంటూ ఎహైమ్ రాష్ట్ర పారిశ్రామికవేత్తలకు ఆయన ఆహ్వానించారు. ప్రతినిధుల బృందంలో ఎహైమ్ అసెంబ్లీ చైర్మన్ హీరోమాసా మియాకేతో పాటు బ్యాంకింగ్ రంగం, వివిధ వ్యాపార సంఘాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో గుండెపోటుకు వేగవంతమైన వైద్యం

● రూ.45వేలు విలువైన ఇంజెక్షన్ ఉచితం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ విజయలక్ష్మి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో గుండె పోటుతో వచ్చే బాధితులకు యుద్ధప్రాతిపదికన వైద్యసేవలు అందిస్తామని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. ఆస్పత్రిలో మంగళవారం రోగులు, వారి సహాయకులకు గుండెపోటు సంభవించిన సమయంలో ఉచితంగా అందించే వైద్యసేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాస్పత్రిలో 'స్టెమి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఏరియా, జిల్లా వైద్యశాలల్లో ఖరీదైన వైద్య సేవలు పైసా ఖర్చు లేకుండా పేదలకు చేరువ చేసిందన్నారు. ప్రజలు ముందుగా గుండెపోటు లక్షణాలపై అవగాహన పెంచుకో వాలన్నారు. ఛాతినొప్పి, ఎడమ చెయ్యి భుజం లాగడం, ఆకస్మాత్తుగా ఆయాసంతో గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణా లను గుండెపోటుగా భావించాలన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైతే గంటలోగా సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో చేరుకోవచ్చన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి రిపోర్టులను ఆన్‌లైన్ ద్వారా అప్పటికపుడు నిపుణులకు పంపిస్తామన్నారు. వారి సూచనలతో గుండె పోటునుంచి కాపాడే రూ.45వేలు విలువైన ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తామన్నారు. ఆ తరువాత అవసరమైతే ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా గుర్తింపు పొందిన ఆస్పత్రిలో ఆంజియో ప్లాస్టీ, బైపాస్ సర్జరీవంటి చికిత్సలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ప్రభుత్వాస్పత్రిలో 24గంటల పాటు గుండె పోటు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. గుండె పోటు సంభవించిన మొదటి గంట సమయం చాలా కీలకంగా భావించాలన్నారు. ఆర్ఎంవో మధు, స్టెమి ఇన్‌ఛార్జి అధికారి చక్రపాణి, ఇన్‌ఛార్జి నర్సింగ్ సూపరింటెండెంట్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు





శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం జల వినాయకుడి సమీపంలో ఉన్న సూర్యభగవానుడి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. సూర్యోదయ వేళ ఆలయ వేదపండితులు సూర్య భగవానుడికి పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, పంచామృతం, గంధంలతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

● పట్టణంలోని ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం డైరెక్టర్ గుడ్లూరు మయూర్ ఆధ్వర్యంలో రథసప్తమిని పురస్కరించుకుని సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



మాట్లాడుతున్న దామోదరనాయుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోకాకోలా ప్లాంట్‌లో రోడ్డు భద్రతా నియమాలపై మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు అవగాహన కల్పించారు. రహదారి మాసోత్సవాలను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోకాకోలాకు సంబంధించిన వాహనాలు నడిపే డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఆరులేన్ల జాతీర రహదారి ఉన్న నేపథ్యంలో వాహనాలు అత్యంత వేగంగా వస్తాయన్నారు. ఈ సమయంలో వాహనాలు రోడ్డు దాటరాదన్నారు. అదే విధంగా రోడ్డుపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లకు బహుమతులను అందజేశారు.

మంత్రి సత్యకుమార్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి తిరుపతి పర్యటన నిమిత్తం మంగళవారం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. కలంకారీ కండువాతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఐఐటీలో ఈశాన్య విద్యార్థుల జాతీయ సమైక్యతా బృందం




ఐఐటీ వద్ద ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు



విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రాష్ట్రాల నుంచి 25మంది విద్యార్థుల బృందం ఎస్ఈఐఎల్(ఇంటర్ - స్టేట్ లివింగ్‌లో విద్యార్థుల అనుభవం) కార్యక్రమం కింద వారి జాతీయ సమైక్యత పర్యటనలో భాగంగా తిరుపతి ఐఐటీ క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ సాంస్కృతిక, సంప్రదాయ పద్ధతులను అర్థం చేసుకోవడానికి, అధ్యాయనం చేయడానికి, పరిచయం చేసుకోవడానికి ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. వారికి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కే.ఎన్. సత్యనారాయణ తదితరులు స్వాగతం పలికారు. జాతీయ సమైక్యత, సాంస్కృతిక మార్పిడి ప్రాముఖ్యతను వారికి వివరించారు. ఐఐటీలోని అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలు, వివిధ సాంకేతిక సౌకర్యాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... ఎస్ఈఐఎల్ కార్యక్రమం కింద జాతీయ సమైక్యత పర్యటన, విభిన్న నేపథ్యాల నుంచి విద్యార్థుల్లో ఐక్యత, అవగాహన పెంపొందించడం, దేశ బంధాలను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు.



తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్సీ మునికృష్ణను సత్కరిస్తున్న టీడీపీ నాయకుడు కొల్లూరి ఇందుశేఖర్

శాస్త్రోక్తంగా రథసప్తమి వేడుకలు





శ్రీకాళహస్తిలో విహరిస్తున్న ముక్కంటి సమేత జ్ఞానప్రసూనాంబ - విక్రుతమాలలో సూర్యప్రభ వాహన సేవ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు జరిగాయి. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సమూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లను చప్పరంపై అధిష్టింపజేసి పట్టణంలో ఊరేగించారు. స్వామి అమ్మవార్లకు భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో కొలువై ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కూడా రథసప్తమిని పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

● ఏర్పేడు మండలంలోని ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామికి, ఆలయ ఆవరణలో ఉన్న సూర్యనారాయణస్వామికి పూజలు నిర్వహించారు. పరశురామేశ్వరస్వామి ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్‌గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న సంతాన సంపద వేంకటేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో మహ్మద్‌రఫి మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... బీసీ కార్పొరేషన్ ద్వారా మండలానికి 34 యూనిట్లకు రూ.79 లక్షలు మంజూరైందని తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాపై కుట్రలు పన్నే వారిని వదలను: ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెత్తందారుల వ్యవస్థను ప్రశ్నించి, వైసీపీని వీడి బయటకు వచ్చిన తనపై కుట్రలు పన్నుతూ తనను, తన కుటుంబాన్ని 11 నెలలుగా మానసికంగా వేధిస్తున్నారని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తనపై విడుదలైన వీడియోలు, జగన్ పత్రికలోని కథనాలను మంగళవారం మీడియా సమావేశంలో ఖండించారు. పిచ్చాటూరులోని కేఎంటీ కల్యాణ మండపంలో జరిగిన టీడీపీ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. సత్యవేడు టీడీపీ అభ్యర్థిగా అధినేత తనకు టికెట్ ఇస్తే అది గిట్టని పార్టీలోని కొందరు వైసీపీతో కుమ్మక్కై తనను ఓడించాలని విఫలయత్నం చేశారని తెలిపారు. అంతటితో ఆగకుండా అమాయక మహిళలను, తనకు అన్నం పెట్టి ఆదరించిన సోదరీమణులను వీధిలోకి లాగుతూ ఇంత నీచానికి ఒడిగడుతారా అంటూ భావేద్వేగానికి లోనయ్యారు. తన 50 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ తప్పు చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోనని స్పష్టం చేశారు. తనకు ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చి గెలిపించిన అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ మాటలకు శిరసావహిస్తానని, వారు ఎలా చెబితే అలా నడుచుకుంటానని తెలిపారు. తన పరువు మర్యాదలకు భంగం కలిగించిన ఏ ఒక్కరిని వదిలేది లేదన్నారు. పరువు నష్టం దావా వేసి అందరికీ కోర్టుకు ఈడుస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, రామచంద్రరాజు, పద్దురాజు, సమాంజలి, రవిరెడ్డి, ఎమ్మెస్ రవి, జయచంద్ర నాయుడు, వాసురెడ్డి, పరమశివం, పీఎస్‌రాజు, చిన్న, వెంకటరమణ, సుబ్రమణ్యం రాజు, మురళి, అన్బు, పార్తిబన్, ఏకాంబరం, భాస్కరన్, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

సప్త వాహనాలపై విహరించిన కల్యాణ వెంకన్న





సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై స్వామివారి ఊరేగింపు

నారాయణవనం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధి చెందిన కల్యాణ వేంకటేశ్వరస్వామి రథ సప్తమిని పురస్కరించుకుని సప్తవాహనాలను అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం 4.30 గంటలకు సుప్రభాతసేవ, నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఉదయం 6.40 గంటలకు సూర్యభగవానుడిని వాహనంగా చేసుకుని కల్యాణ వెంకన్న మంగళ వాయిద్యాల నడుమ పట్టణంలో ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న వెంకన్న చిన్నశేష, పల్లకి, కల్పవృక్ష వాహనాల్లో ఊరేగారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి పెద్ద శేష వాహనంపై, మధ్యాహ్నం తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో విహరించారు. సాయంత్రం 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేడుకల్లో సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు తదితరులు పర్యవేక్షించారు.

సూర్యప్రభపై మలయప్ప విహారం



రేణిగుంట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా దారిపొడవునా భక్తజనులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

టీడీపీ మండల అధ్యక్షుడికి మాతృ వియోగం

రేణిగుంట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రేణిగుంట మండల అధ్యక్షుడు మునిచంద్రా రెడ్డి తల్లి ఆనందమ్మ మంగళవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మ గాజులమండ్యం చేరుకున్నారు. ఆనందమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

చికిత్స పొందుతూ బాలిక మృతి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా ఒకరు మృతి చెందారు. ఈ ఘటన తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. తిరుపతి ఆటోనగర్‌కు చెందిన మురళి సెకెండ్‌హ్యాండ్ కార్లను విక్రయిస్తుంటాడు. ఆయన భార్య శ్యామల, కవల పిల్లలైన హాసిని, హర్షిణి(13)తో కలిసి నెల్లూరులోని బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లారు. మంగళవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. వేలూరుకు చెందిన ఓ వ్యాపారి కుటుంబంతో నెల్లూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో తిరుపతికి చెందిన మురళి, భార్య శ్యామల, కుమార్తెలు హాసిని, హర్షిణి గాయపడ్డారు. శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ హర్షిని మృతి చెందింది.

ఎరువుల దుకాణాల తనిఖీ

కేవీబీపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి కృష్ణకుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం సరఫరా చేసే ఎరువులను కల్తీ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మాలని దుకాణదారులను ఆదేశించారు. అలాగే నిల్వ ఉన్న ఎరువులు, పురుగుమందులను రైతులకు విక్రయించకూడదన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీధి వ్యాపారులకు స్థలాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధి వ్యాపారులకు స్థలాలు కేటాయించారు. సినిమావీధిలో 30 సంవత్సరాలుగా పలువురు వీధి వ్యాపారాలు చేసుకునేవారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందికరంగా ఉండడంతో హైకోర్టు ఆదేశాలతో వారిని అక్కడి నుంచి తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. దీంతో మంగళవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, చెంచయ్యనాయుడు, ఏఐటీయూసీ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌తో చర్చించారు. ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న బాలుర వసతిగృహం ప్రహరీని ఆనుకుని అనుమతి ఇవ్వాలని కోరగా ఆయన అనుమతిచ్చారు. తమ సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే సుధీర్‌కు ఏఐటీయూసీ నాయకులు, వీధివ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జె.గురవయ్య, గోపి, వైఎస్ మణి, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన శివకుమార్, జనార్ధన్, మురళి, కన్నయ్య, రమేష్, లతీఫ్, రజని తదితరులు పాల్గొన్నారు.

గోమేత పొరంబోకు స్థల పరిశీలన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం కోబాక పంచాయతీలో సర్వే నెం.174లో 123.5 ఎకరాలను గో మేత పొరంబోకుగా దళితులకు, పాడి రైతులకు ప్రభుత్వం కేటాయించింది. ఈ స్థలంలో పశువులు, గొర్రెల మేతకు ఉపయోగించుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ స్థలాన్ని కబ్జా చేసి విక్రయించి ఇళ్లు నిర్మించుకున్నారని, ప్రస్తుతం కొంతమంది ఆ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని దళితులు, పాడిరైతులు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు మార్కండేయులు అన్నారు. రథసప్తమిని పుర్కరించుకుని పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో మంగళవారం సూర్య నమస్కార యోగాసనం వేశారు. యోగాతో మానసిక, శారీరక ధృడత్వం ఏర్పడుతుందన్నారు. ఇక అదే విధంగా శివసాయి యోగా సెంటర్ ఆధ్వర్యంలో బింగిమల్ల సురేష్ గార్డెన్స్‌లో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో యోగా మాస్టర్లు ఆయిలం సుజాత, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



తహసీల్దారుకు అర్జీ అందిస్తున్న సీపీఎం నాయకులు

కేవీబీపురం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్ని రెవెన్యూ సదస్సులు, ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసినా భూ సమస్యలు పరిష్కారం కావడంలేదని సీపీఎం నాయకుడు దాసరి జనార్ధన్ అన్నారు. రాజులకండ్రిగ రెవెన్యూలో సర్వే నెం.428/2ఏలో 1.39ఎకరాలు దళితుడైన వెంకటయ్య తల్లి కలపాటి పెంచలమ్మ పేరుమీద మంజూరుచేసి ఉన్నారన్నారు. ఆ భూమిలోకి ప్రవేశించకుండా మఠం గ్రామానికి చెందిన అగ్రకులస్థులు అడ్డుకుంటున్నారన్నారు. అంజూరు కాలువ పొరంబోకులో సర్వే నెం. 261/3లో కాలువకు సంబంధించిన భూమిని ఆక్రమణకు గురై పొలాలకు నీరు అందడం లేదన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారు మునిరత్నంరెడ్డిని కోరారు. గురవయ్య, నాగరాజు, వెంకటయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మొదటి దశలో గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స సులభం



పిచ్చాటూరులో జరిగిన ర్యాలీ

పిచ్చాటూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించగలిగితే సులభంగా వ్యాధిని నయం చేసుకోవచ్చని పీహెచ్‌సీ వైద్యుడు హమీద్ తెలిపారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ నివారణ దినాన్ని పురస్కరించుకుని ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై విజయం సాధించాలంటే స్క్రీనింగ్‌తోనే సాధ్యపడుతుందన్నారు. వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండి అలవాట్లు ఆహారం పట్ల జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ దరిచేరదని తెలిపారు. డాక్టర్ మునిచరిత, సూపర్‌వైజర్ శాంతి, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండల వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణ దినాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 10న జరిగే జాతీయ నులిపురుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైద్యాధికారి తేజస్విని, సీహెచ్‌వో, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.